## క్లుప్తంగా

### పౌష్టికాహారంపై అవగాహన



పెనమలూరు: పౌష్టికాహారంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని వణుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రఘురామ్ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు శనివారం మానవహారం నిర్వహించారు. అనంతరం జరిగిన అవగాహన కార్యక్రమంలో రాఘురామ్ మాట్లాడుతూ చిన్నతనంలో పౌష్టికాహారం, ఆకు కూరలు తినడం వల్ల ఆరోగ్యంగా పెరుగుతారని తెలిపారు. అలాగే రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుందని అన్నారు. అత్యవసర సమయాల్లో ఉపయోగపడే హెల్ప్‌లైన్‌ల వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణకు నో వెహికల్ డే

పెనమలూరు: పర్యావరణ పరిరక్షణకు కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం నో వెహికల్ డే నిర్వహించారు. కాలేజీ యాజమాన్యం, ప్రొఫెసర్లు, ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రధాన ద్వారం వద్ద వాహనాలు కాలేజీ ఆవరణలోకి రాకుండా కాలుష్య నివారణపై అవగాహన కల్పించారు. పౌష్టికతతో కూడిన జీవన శైలి, నడక, సైక్లింగ్‌పై సందేశం ఇచ్చారు. ప్రతినెలా రెండవ శనివారం నో వెహికల్ డే నిర్వహిస్తామన్నారు. వాహనాలపై వచ్చిన వారికి గులాబీలు అందజేశారు. కాలేజీలో పచ్చదనం కాపాడటానికి కార్యక్రమం నిర్వహించామని విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ పీ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం రవిచంద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ముస్తాబాద ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులు

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద-సూరంపల్లి రోడ్డు మార్గంలో ఏర్పడ్డ గోతులకు ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. రూ. 28లక్షల అంచనా వ్యయంతో ఈ మార్గంలో రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు పూడ్చివేస్తున్నట్లు ఆర్‌అండ్‌బీ డీఈ బలరాం శనివారం చెప్పారు. ఇక్కడ గుంతలతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తులతోపాటు విద్యార్థులు కూడా అవస్థలు ఎదుర్కొంటున్నారు. అలాగే హైస్కూల్ జంక్షన్ నుంచి గ్రామంలోకి వెళ్లే రోడ్డు పనులు కూడా ప్రారంభించారు.

### విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బ్రేకర్ మార్పు



కంకిపాడు: కంకిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ నియంత్రణ, సరఫరాలో కీలకంగా వ్యవహరించే బ్రేకర్‌ను శనివారం అధికారులు మార్పు చేశారు. 20 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన బ్రేకర్ స్థానంలో రూ. 8 లక్షల వ్యయంతో నూతన బ్రేకర్ ఏర్పాటుచేశారు. సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు పూర్తి చేశారు. ఈ పనులను విద్యుత్‌శాఖ ఏడీఏ బి. నవీన్‌కుమార్, ఏఈ టి. అశోక్‌కుమార్ పర్యవేక్షించారు. నవీన్‌కుమార్ మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో లోటుపాట్లు తలెత్తకుండా సమర్థంగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

### వక్ఫ్ చట్ట సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలి



కంకిపాడు: వక్ఫ్ చట్టం సవరించేందుకు కేంద్రం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లును ఉపసంహరించుకోవాలని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, వక్ఫ్ బోర్డు ఉమ్మడి కృష్ణాజిల్లా మాజీ వైస్ చైర్మన్ షేక్ చిన్నా డిమాండ్ చేశారు. ఈడుపుగల్లులోని తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ వక్ఫ్ చట్టం సవరణ బిల్లు వెనక్కి తీసుకోవాలని ముస్లింలు ముక్తకంఠంతో కోరుతున్నారన్నారు. ఆక్రమణలో ఉన్న లక్షలాది ఎకరాల వక్ఫ్ భూములను స్వాధీనం చేసుకునేందుకు చట్టాన్ని సవరించి, ఆ భూములను వక్ఫ్‌బోర్డుకు అప్పగించాలని డిమాండ్ చేశారు. చట్టంలోని లొసుగులను అడ్డం పెట్టుకుని వక్ఫ్ భూములను ఆక్రమించుకుంటున్నారని విమర్శించారు. భూములను పరిరక్షించి తద్వారా వచ్చే ఆదాయంతో మసీదుల అభివృద్ధితో పాటుగా ముస్లిం కుటుంబాల విద్య, వైద్యం, ఆర్థిక అభ్యున్నతికి వినియోగించాలని కోరారు.

### సామాజిక సేవ ప్రతి ఒక్కరి బాధ్యత

కంకిపాడు: సామాజిక సేవ ప్రతీ ఒక్కరి బాధ్యత అని కొడాలి ప్రేమభాస్కర్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొడాలి కృపాల్ విద్యాసాగర్ అన్నారు. మండలంలోని కోలవెన్ను గ్రామంలో పేదలు, వృద్ధులకు చీరల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయురాలు కొడాలి ప్రేమాబాయమ్మ చేతులమీదుగా వృద్ధులకు చీరలు అందజేశారు.

# రైతు ఆశలపై నీళ్లు

**కృష్ణమ్మకు కోపం.. రైతుకు శాపం**

- నీట మునిగిన పొలాలు
- తడిచి కుళ్లిన పంటలు
- కృష్ణాలో 48,641 హెక్టార్లలో పంట మునక
- అత్యధికంగా దెబ్బతిన్న వరిసాగు
- ఎకరాకు రూ. 20వేలకు పైగా ఖర్చు.. లెక్క తేలని పంట నష్టం



ఆరుగొలను గ్రామంలో నీట మునిగిన వరి పొలం

సాక్షి, మచిలీపట్నం: కృష్ణమ్మ ఉగ్రరూపం.. రైతు ఆశలపై నీళ్లు చల్లింది. మరోవైపు బుడమేరు ముంపు.. ఖరీఫ్ సాగును ముంచేసింది. వారంలో రెండుసార్లు వరద రావడంతో పంట నీట మునిగింది. సుమారు పది రోజులకు పైగా చేలు చెరువులుగా మారాయి. బుడమేరు, కృష్ణమ్మ వరద ప్రవాహం.. అన్నదాతకు శాపంగా మారింది. కృష్ణా జిల్లా రైతులను నిలువునా ముంచేసింది. అధిక వర్షాలు, వరదలతో నీటి మునిగి, కుళ్లిపోయిన పంటలు, రైతులకు కలిగిన నష్టాలను పరిశీలించేందుకు 'సాక్షి' బృందం శనివారం బాపులపాడు, నందివాడ ప్రాంత గ్రామాల్లో పర్యటించింది.

**రైతన్న కష్టం.. నీటిపాలు**

ఖరీఫ్ ఆరంభం నుంచి రైతులు ఆశతో సాగుపై దృష్టి పెట్టారు. జిల్లాలో 1.46లక్షల హెక్టార్లలో పంటలు వేశారు. ఇందులో అత్యధికంగా వరి 1.40 లక్షల హెక్టార్లు, పత్తి 300, వేరుశెనగ 765, మినుములు 520, చెరుకు 265, మొక్క జొన్న 112 హెక్టార్ల చొప్పున సాగైంది. ఇటీవల వచ్చిన వరదల కారణంగా 44,521 హెక్టార్ల పంట ముంపునకు గురైంది. మరో 4,070 హెక్టార్ల ఉద్యాన, 50హెక్టార్ల పట్టు పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో వరి రైతుకే భారీ నష్టం చేకూరింది. కేవలం బాపులపాడు మండలంలోనే 3,094 హెక్టార్ల వరి పంట దెబ్బతింది.

**లెక్కకు రాని పంట నష్టం**

జిల్లాలో 48,641 హెక్టార్లలో పంట నీట మునిగింది. వీటిలో 44,521 హెక్టార్ల వరి, వేరుశెనగ, మినుములు, చెరుకు, పత్తి తదితర పంటలు ముంపునకు గురికాగా మరో 4,070 హెక్టార్ల ఉద్యాన, 50 హెక్టార్ల పట్టు పంటలు దెబ్బతిన్నాయి. వరద తగ్గుముఖం పట్టడంతో పంట నష్టం నమోదుపై అధికారులు దృష్టి పెట్టారు. ఇంకా పలు చోట్ల పొలాల్లో నీరు ఉండటంతో ఇప్పటి వరకు 95శాతం నమోదు మాత్రమే పూర్తయింది. దీంతో పంట నష్టం అంచనాకు రాలేదు.

**ప్రాథమిక అంచనా నష్టం రూ. 493.06 కోట్లు**

వరదల కారణంగా వ్యవసాయ శాఖకు అత్యధికంగా నష్టం జరిగింది. 25 మండలాల్లోని 425 గ్రామాల్లో దీని ప్రభావం ఉండటంతో రూ. 493.06 కోట్ల నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనా వేశారు. వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లగా వాటి విలువ రూ. 385.24 కోట్లుగా, ఉద్యాన పంటల నష్టం రూ. 107.82 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. అయితే 50.399 హెక్టార్ల పట్టు పంట నష్టం అంచనాకు రాలేదు.

**పూర్తి పరిహారం ఇవ్వాలి**



వరద కారణంగా జిల్లాలో 48వేల హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. కేవలం బాపులపాడు మండలంలోనే 3,094 హెక్టార్లు దెబ్బతింది. ప్రతి రైతును ఆదుకోవాలి. అప్పోసొప్పో చేసిన అన్నదాతకు పూర్తి పరిహారం ఇవ్వాలి. రైతులతో పాటు కౌలు రైతులను ఎలాంటి నిబంధన లేకుండా ఆదుకోవాలి.

– రావులపల్లి ఆంజనేయులు, బాపులపాడు రైతు సంఘం నాయకుడు

**మూడు ఎకరాలకు రూ.75వేల ఖర్చు**



ఖరీఫ్ సీజన్‌లో వచ్చిన తొలకరి వర్షాలకు సంబరపడి ఎంతో ఆశతో మూడు ఎకరాల వరి సాగు చేశా. నారు, పొలం సేద్యం, నాడు, కూలీలు, ఎరువులు, పురుగుల మందులు ఇలా అన్ని ఖర్చులకు ఎకరాకు రూ. 25వేల చొప్పున మొత్తం రూ. 75వేలు ఖర్చు చేశాను. పంటంతా ముంపునకు గురి కావడంతో ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు.

– అడపాక రామారావు, ఆరుగొలను, బాపులపాడు మండలం

## ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభుత్వాధినేతలు



నవోదయ విద్యాలయంలో యూత్ పార్లమెంట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభుత్వాధినేతలు అని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. బాపులపాడు మండలం వేలేరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 26వ యూత్ పార్లమెంట్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. పాఠశాల ప్రాంగణంలో శాస్త్రవేత్తల విగ్రహాలు, చిత్రపటాలతో ఏర్పాటు చేసిన గ్యాలరీని తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఏర్పాటు, ప్రజా ప్రతినిధుల ఎన్నిక, సమావేశాలు జరిగే తీరు, చట్టాల రూపకల్పన జరిగే విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ తరహా యూత్ పార్లమెంట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రధాన మంత్రి, ప్రతిపక్షనేత, స్పీకర్, ఎంపీ పాత్రలతో మాక్ పార్లమెంట్ సమావేశాలను ఆసక్తికర చర్చలతో నిర్వహించిన విధానం అందరిని ఆకట్టుకుంది. నవోదయ ప్రాంగణంలో జరిగిన వనమహోత్సవంలో ఎమ్మెల్యే యార్లగడ్డ మొక్కలు నాటారు. విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

## యనమలకుదురులో స్వచ్ఛతా హీ సేవ



కరకట్ట రహదారి వద్ద చెత్త ఊడ్చుతున్న కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు

పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ యనమలకుదురులో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం చేపట్టారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు యనమలకుదురు గుడి వద్ద గ్రామస్తులు, మున్సిపాలిటీ సిబ్బందితో స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విజయవాడ-అవనిగడ్డ కరకట్ట ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కమిషనర్‌తోపాటు, మున్సిపాలిటీ ఉద్యోగులు, గ్రామస్తులు రహదారులు ఊడ్చి చెత్త కుప్పలు తొలగించారు. కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరుచుతామన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన జీవనం గడపడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామస్తులను భాగస్వామ్యం చేసి స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

### వేలంలో రూ. లక్ష పలికిన లడ్డూ



పెనమలూరు: పెనమలూరు చిన్నగుడి గణేష్ ఉత్సవాలు వైభవంగా జరిగాయి. దుర్గా నవరాత్రుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయకుడిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి లడ్డూ వేలంపాటలో గ్రామానికి చెందిన కిలారు వెంకటేశ్వరరావు(రావు) రూ. లక్షకు కైవసం చేసుకున్నారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. లడ్డూ వేలం పాట పాడిన కిలారు వెంకటేశ్వరరావు లడ్డూతో స్వామివారిని ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటం అందరిని ఆకట్టుకుంది. గ్రామంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### పబ్లిక్ టాయిలెట్స్‌తోనే పారిశుద్ధ్యం మెరుగు

కంకిపాడు: పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణంతో పారిశుద్ధ్యం మెరుగు పడుతుందని అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సోషల్ వర్కర్ యలమంచిలి కిషోర్‌బాబు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కంకిపాడు పట్టణం 40 గ్రామాలకు కూడలిగా ఉందన్నారు. వివిధ పనుల నిమిత్తం ప్రజలు వేలాది సంఖ్యలో కంకిపాడు వస్తుంటారు. అత్యవసర వేళ మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యపై గత నెల 23న గ్రామసభలో వినతిపత్రం అందించామన్నారు. పంచాయతీ సర్పంచ్ బాకీ రమణ, పాలకవర్గ ప్రతినిధులు, అధికారులు పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని సాధారణ సమావేశంలో తీర్మానించారని చెప్పారు. రెవిన్యూ అధికారులు స్థలాన్ని గుర్తించి పంచాయతీకి అప్పగించాలని కోరారు.

### వరద బాధితులకు రూ. 3 లక్షల విరాళం



పెనమలూరు: విజయవాడ వరద బాధితులకు కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకి సీతాపురంకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ బాధ్యులు రూ. 3 లక్షల విరాళాన్ని సీఎం సహాయ నిధికి అందజేశారు. పోరంకిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం కాలనీవాసులు చెక్కును ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో అనుమోలు ప్రభాకరరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా పర్యావరణ పరిరక్షణ వారోత్సవాలు

కంకిపాడు: పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత వారోత్సవాలు ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్‌లో శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ పి.నాగలక్ష్మి పర్యవేక్షణలో 1, 2 తరగతి విద్యార్థులకు జీరో వేస్ట్ లంచ్ డే నిర్వహించారు. 3, 4, 5 తరగతి విద్యార్థులు మొక్కలు నాటి వాటి విలువను తెలిపారు. 6, 7, 8 తరగతి విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రిన్సిపాల్ నాగలక్ష్మి మాట్లాడుతూ సెల్ఫ్ లెర్నింగ్ విద్యావిధానంతో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి విద్యాసంస్థ పాటుపడుతుందని పేర్కొన్నారు.

### గంగ చెంతకు గౌరీ తనయుడు



ఉయ్యూరు: గణేష్ నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఉయ్యూరు పట్టణంతో పాటు మండలంలోని 11 గ్రామాల్లో శనివారం వినాయక నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాల జోరు.. తీన్మార్ సందడితో పట్టణంలో కోలాహలం నెలకొంది. యువత ఉత్సాహంగా ఊరేగింపు నిర్వహించి గణనాథుడిని నిమజ్జనం చేశారు. ఎంకే గ్రూప్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు దేవతామూర్తుల వేషధారణ ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. సుందరమ్మపేట, కొబ్బరితోట, బస్టాండు సెంటర్లలో నిర్వహించిన అన్నసంతర్పణ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొన్నారు.

## ముంపులోనే దావాజీగూడెం జెడ్పీ హైస్కూల్



దావాజీగూడెం జెడ్పీ హైస్కూల్ ఆవరణలో నిలిచిన వరద నీరు

దావాజీగూడెం(గన్నవరం): మండలంలోని దావాజీగూడెం జెడ్పీ హైస్కూల్ ఇంకా వరద ముంపులోనే ఉంది. పాఠశాల ప్రాంగణం పల్లంగా ఉండటంతో వరద నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. వరద నీటితో తీవ్ర దుర్వాసన వస్తున్నప్పటికీ తరగతులు నిర్వహిస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మర్లవాగు నుంచి వరద నీరు రమణమ్మ చెరువు మీదుగా పాఠశాల ప్రాంగణంలోకి చేరాయి. వరద దాటికి పాఠశాల ప్రహరీ 50 మీటర్ల పొడవున కుప్పకూలింది. క్రీడా ప్రాంగణంలో మోకాలి లోతున నీరు నిలవడంతోపాటు రోజుల తరబడి నిల్వ ఉండటంతో తీవ్ర దుర్వాసన వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. వరద నీటిలో నుంచి టాయిలెట్స్‌కు వెళ్లేందుకు అసౌకర్యానికి గురవుతున్నారు. దావాజీగూడెం-అల్లాపురం గ్రామాల మధ్య ఉన్న సరిహద్దు వాగు ద్వారా వరద నీటిని తరలించే అవకాశం ఉన్నా.. ఆ దిశగా అధికారులు ప్రయత్నాలు చేయడం లేదు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి వరద నీటి ముంపు నుంచి పాఠశాలను కాపాడాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

## భక్తిశ్రద్ధలతో సామూహిక సరస్వతీ పూజ



పెనమలూరులో సామూహిక సరస్వతీ పూజ చేస్తున్న చిన్నారులు

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో వినాయక ఉత్సవాల్లో భాగంగా శనివారం చిన్నారులతో సామూహిక సరస్వతీ పూజలు చేయించారు. గ్రామంలోని పల్లిపేటలో వినాయకుడి 34వ వార్షికోత్సవం సందర్భంగా గతకొద్ది రోజులుగా వినాయక ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. సామూహిక సరస్వతీ పూజలో పాల్గొన చిన్నారులకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

**గ్రామాల్లో అన్నసమారాధన**

కాగా చవితి ఉత్సవాల్లో భాగంగా శనివారం గ్రామాల్లో భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. పోరంకిలో గంగానమ్మ గుడి వద్ద వినాయక ఉత్సవాల సందర్భంగా దాదాపు రెండువేల మంది భక్తులను అన్నసమారాధన చేశారు. అదేవిధంగా టీడీపీ ఆఫీస్ రోడ్డులో ఉన్న వినాయకుడి విగ్రహం వద్ద కూడా అన్నసమారాధన జరిగింది. పెనమలూరు చిన్నగుడి, కానూరు, యనమలకుదురు ప్రాంతాల్లో అన్నసమారాధన నిర్వహించారు. కాగా ఆదివారం పలు వినాయకుడి మండపాల్లో లడ్డూ వేలం పాటలు ఉన్నాయి. అనంతరం ఎద్ద ఎత్తున గణనాథుడి నిమజ్జన ఊరేగింపు జరగనుంది.

## దేశాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకం



సాహితీ క్లబ్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు

రామవరప్పాడు: దేశాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకమని విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. ఏకాంబరం నాయుడు అన్నారు. కళాశాలలో శనివారం భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు నూతన ఆవిష్కరణలతోపాటు కంపెనీలు నెలకొల్పి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. మలబార్ గోల్డ్ మార్కెటింగ్ మేనేజర్ ఎండీ ఖాసిం మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను నేర్చుకోవడానికి మాత్రమే పరిమితం కాకుండా విమర్శనాత్మకంగా ఆలోచించడం, సమస్యలను పరిష్కరించడం వంటి వాటిపై కూడా శిక్షణ పొందాలని సూచించారు. అనంతరం ఇంజినీరింగ్ సొల్యూషన్స్ ఫర్ ఎ సస్టైనబుల్ వరల్డ్ అంశంపై పేపర్ ప్రజెంటేషన్, డిజిటల్ పోస్టర్, డిజైనింగ్, పైథాన్, జావా కోడింగ్ అంశాలపై ఆన్‌లైన్ క్విజ్ నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల చైర్మన్ బోయపాటి అప్పారావు, సెక్రటరీ శ్రీకృష్ణ, ఏట ప్రతాప్, అధ్యాపకులు పాల్గొన్నారు.

**సాహితీ క్లబ్ బ్రోచర్ ఆవిష్కరణ**

ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం సాహితీ క్లబ్ బోచర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు సాహిత్యంపై అవగాహన తీసుకొచ్చేందుకు కళాశాలలో సాహితీ క్లబ్ ఏర్పాటు చేసి పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బొర్రా ప్రతాప్ మాట్లాడుతూ సాహిత్య క్లబ్ ద్వారా ఎంతోమంది విద్యార్థులు మంచి రచయితలుగా ఎదిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ బి.పావని, రోటరాక్ట్ క్లబ్ అధ్యక్షుడు రిత్విక్ రామ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సీతారాం ఏచూరి మృతి తీరని లోటు

కంకిపాడు: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి తీరని లోటు అని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు అన్నారు. కంకిపాడులోని సంఘ కార్యాలయంలో ఏచూరి సంతాప సభ శనివారం నిర్వహించారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి సంఘ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోగులమూడి రాజు మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించే నేత ఏచూరి అని కొనియాడారు. ప్రజా సంక్షేమం కోసం పోరాటాలకు, ఉద్యమాలకు జీవితాన్ని అంకితం చేసిన ఏచూరి జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు సంఘ నేతలు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: పీడిత ప్రజల పక్షాన సీతారాం ఏచూరి చేసిన పోరాటాలు చిరస్మరణీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు అన్నారు. స్థానిక నూజివీడురోడ్డులోని సీపీఎం కార్యాలయంలో శనివారం సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి బేతా శ్రీనివాసరావు, మాజీ కార్యదర్శి అబ్దుల్ బారీ, జుజ్జువరపు ఏసుపాదం, సీఐటీయూ మండల కార్యదర్శి నల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.

### యువతి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: యనమలకుదురులో యువతి అదృశ్యమైన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు లంబాడీపేటకు చెందిన జ్యోతి, భాస్కరావుకు కుమార్తె స్మైలీ (19)ఉంది. ఆమె పదవ తరగతి చదివి ఇంట్లోనే ఉంటోంది. ఆమెకు ఇటీవల ఇన్‌స్టాగామ్‌లో మల్లయ్య అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కుమార్తెను మందలించారు. కాగా శుక్రవారం స్మైలీ ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఉందన్న సమాచారంతో కుటుంబసభ్యులు వెళ్లగా ఆమె అక్కడి నుంచి అదృశ్యమైంది. తల్లి జ్యోతి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### 2,421 హెక్టార్ల పంట నష్టం

గన్నవరం రూరల్: మండలంలోని గ్రామాల్లో రైతాంగం 2,421.69 హెక్టార్లలో పంటలు నష్టపోయినట్లు ఎంఏవో ఎస్ఎల్ తేజశ్వి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 2,350 మంది రైతులు నష్టపోయినట్లు చెప్పారు. పత్తి 219.91, వేరుశనగ 29.72, చెరకు 11.31 హెక్టార్‌లలో వర్షాల కారణంగా దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు.

### నిత్యావసర సరుకుల పంపిణీ



అంబాపురం(విజయవాడ రూరల్): అంబాపురం గ్రామంలోని వరద బాధితులకు చర్చి ఆఫ్ సౌత్ ఇండియా(సీఎస్ఐ) కృష్ణా గోదావరి డయాసిస్ బిషప్ ద రైట్ రెవరెండ్ డాక్టర్ తంటేపూడి జార్జ్ కొర్నేలియస్ వితరణతో శనివారం సీఎస్ఐ చర్చిలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఇటీవల వచ్చిన వరదల కారణంగా సర్వస్వం కోల్పోయిన 500 కుటుంబాలకు బియ్యం, వంట నూనె, కందిపప్పు, పంచదార, కూరగాయలతో కూడిన రూ. 1,500 విలువ చేసే నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. డీనరీ చైర్మన్ రెవరెండ్ చిలువూరి జయరాజు, మాజీ గ్రామ సర్పంచి తోడేటి విజయ్‌కుమార్, సీఎస్ఐ సంఘ పెద్దల ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను అందజేశారు.